క్లుప్తంగా

చురుగ్గా కుల గణన సర్వే



సామర్లకోట సాయినగర్‌లో సర్వే చేస్తున్న సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు

సామర్లకోట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కుల గణన సర్వే చురుగ్గా సాగుతోంది. శనివారం మున్సిపాలిటీ పరిధిలో ప్రారంభమైన కుల గణన సర్వే ఆదివారం కూడా కొనసాగింది. సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు సర్వే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆధార్ కార్డులకు లింక్ అయిన ఫోన్ నంబరు ఆధారంగా ప్రతిఒక్కరి కులాన్ని నమోదు చేస్తున్నారు. సర్వే జరుగుతున్న సమయంలో ఇళ్ల వద్ద కుటుంబ సభ్యులు లేని సమయంలో, వారి ఫోన్‌కు వచ్చిన ఓటీపీని నమోదు చేసి కుల గణన సర్వే జరుగుతోంది. ఈ సర్వే పూర్తయితే ఏ కులస్తులు, ఎంత మంది ఉన్నారో స్పష్టత వస్తుంది.

ఘనంగా సత్యసాయి విహార్ వార్షికోత్సవం



పూజలు నిర్వహిస్తున్న సత్యసాయి భక్తులు

పెద్దాపురం: వడ్లమూరు సత్యసాయి విహార్ 50వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సత్యసాయిబాబా వడ్లమూరు గ్రామానికి వచ్చి యాభై ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో లోక కల్యాణార్థం రాష్ట్రవ్యాప్త కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు డాక్టర్ కొఠారు సాయి శ్రీహరి ప్రసాద్‌శర్మ వివరించారు. ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, స్వామివారికి అభిషేకం, అర్చన, సామూహిక సీమంతాలు, ప్రవచనాలు జరిగాయి. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు.

ఫిబ్రవరి 16 నుంచి ఉరుసు ఉత్సవాలు



పొన్నాడలో బషీర్‌బీబీ దర్గా

కొత్తపల్లి: మండలంలోని పొన్నాడలో వేంచేసిన బషీర్‌బీబీ (బంగారు పాప) ఉరుసు ఉత్సవాలు ఫిబ్రవరి 16 నుంచి 18వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు ఆదివారం స్థానిక ముజావర్లు షేక్ ఇమామ్ వలీ, షేక్ పీర్ మహమ్మద్ షేక్ బడే సాహెబ్ తెలిపారు. పొన్నాడలో 69వ ఉరుసు ఉత్సవాలను మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు.

భరోసా ఇచ్చేందుకే..

సామర్లకోట: బీసీలకు భరోసా ఇచ్చేందుకే జయహో బీసీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పట్టణంలో ఆదివారం ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లను తగ్గించి, ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బలుసు వాసు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎస్సైగా ఎంపికైన సుధీర్‌బాబుకు సత్కారం



ఎస్సైగా ఎంపికైన సుధీర్‌బాబును సన్మానిస్తున్న గ్రామ పెద్దలు

ప్రత్తిపాడు రూరల్: ఇటీవల ఎస్సై రాతపరీక్షల్లో ప్రతిభ చూపి ఎస్సైగా ఎంపికైన రెడ్డిపల్లి సుధీర్‌బాబు, అతని తల్లిదండ్రులు సత్యనారాయణ, రాఘవమ్మలను ఆదివారం ఘనంగా సత్కరించారు. మండలంలోని ధర్మవరం నూకాలమ్మతల్లి ఆలయం వద్ద సన్మాన సభ నిర్వహించారు. గ్రామానికి చెందిన వీరవేంకటవిజయదుర్గా నాట్య మండలి అధ్యక్షుడు సానా నూకరాజు నాయుడు ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు పూలమాలలు, శాలువాతో వారిని సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ సుధీర్ బాబు ఎస్సైగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. యువత సుధీర్‌బాబును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా పని చేసి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నానిపల్లి చంటి, యర్రాబత్తుల గోవిందనాయుడు, దొడ్డిపట్ల సోమన్నదొర, చింతా పెద కాపు, జాగు సూర్యనారాయణ, తూపాటి సత్తిరాజు, స్వయంబారపు రమణ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగు.. ఎంతో బాగు

- ఈ వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలు
- జీవం తక్కువగా ఉన్న భూమికి దన్ను
- రైతుల్లో క్రమంగా పెరుగుతున్న ఆదరణ
- మండలంలో 1,348 ఎకరాల్లో సేద్యం
- అన్ని విధాలా ప్రభుత్వ ప్రోత్సాహం



జీవామృత ఎరువులతో వేస్తున్న వరి నాట్లు

సామర్లకోట: రసాయన ఎరువులు, పురుగు మందులతో చేస్తున్న వ్యవసాయం ద్వారా ఆహార ఉత్పత్తులు విషతుల్యమవుతున్నాయన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతున్న నేపథ్యంలో.. సేంద్రియ సేద్యానికి ఎనలేని ప్రాధాన్యం ఏర్పడింది. అందుకు తగ్గట్టుగా రాష్ట్ర ప్రభుత్వం అనేక రకాలుగా ప్రోత్సహిస్తుండడంతో అన్నదాతలు మరింత ఉత్సాహం చూపుతున్నారు.

సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రకృతి వ్యవసాయ సంస్థలను ఏర్పాటు చేసి, వారి ద్వారా రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా సేంద్రియ వ్యవసాయంపై ఉత్సాహం ఉన్న సర్పంచ్‌లకు శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా మండల పరిధిలో అచ్చంపేట, గొంచాల, నవర, చంద్రంపాలెం, పవర గ్రామాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయం చేయడానికి ముందుకు వచ్చారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు క్రమ క్రమంగా వాడటం తగ్గించి, రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు ప్రోత్సహిస్తున్నారు. మండల పరిధిలో 974 మంది రైతులు 1,348 ఎకరాల్లో ప్రస్తుత సీజన్‌లో ప్రకృతి వ్యవసాయం చేయడానికి ముందుకు వచ్చినట్టు మండల వ్యవసాయాధికారులు చెబుతున్నారు. సేంద్రియ వ్యవసాయానికి సంబంధించి జీవామృతం తయారు చేసే పద్ధతిపై అవగాహన కల్పిస్తున్నారు.

పెద్దాపురం నియోజకవర్గంలోని జి.రాగంపేట, ఉండూరు, జి.మేడపాడు, అచ్చంపేట వర్మీ కంపోస్టు యూనిట్లు ఇప్పటికే జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయి. అదే విధంగా విస్తరణ శిక్షణ కేంద్రంలో వర్మీ కంపోస్టు యూనిట్ ఏర్పాటు చేసి, దాని ద్వారా వచ్చిన ఎరువులతో కొబ్బరి, మామిడి, జామ, నేరేడు వంటి పండ్ల మొక్కలను పెంచుతున్నారు. సేంద్రియ పంటకు అధిక ధర పలుకుతోంది. సేంద్రియ ఎరువులతో పండించిన పంటలు ఆరోగ్యవంతమైన పంటలుగా శాస్త్రవేత్తలు ధ్రువీకరించడంతో రాష్ట్ర ప్రభుత్వం సేంద్రియ వ్యవసాయానికి ప్రాధాన్యమిస్తోంది. రసాయన ఎరువులతో వ్యవసాయం చేయడం వల్ల భూమిలో సారం క్షీణిస్తోంది. ప్రకృతి సిద్ధంగా లభించే ఎండిన పేడలతో జీవామృతం, వర్మీ కంపోస్టు, వేప పిండి వంటి పదార్థాలతో వ్యవసాయం చేయడంతో పెట్టుబడి తక్కువగా ఉంటుందంటున్నారు. రైతుల కోసం జీవన ఎరువులను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకు వస్తోంది.

అప్పటి నుంచే ప్రేరణ



తొమ్మిదో తరగతి చదువుకునే సమయం నుంచి వ్యవసాయంపై ప్రేరణ కలిగింది. మండల వ్యవసాయాధికారిగా పని చేసిన మధుసూధనరావు వ్యవసాయంపై ప్రోత్సహించారు. దాంతో 2014లో ఒక ఎకరంలో సేంద్రియ వ్యవసాయం ప్రారంభించి, ప్రస్తుతం మూడు ఎకరాల్లో సాగు చేస్తున్నాను. పండిన పంటను స్వయంగా మిల్లింగ్ చేసి, రైతులకు, డాక్టర్లు, లాయర్లకు విక్రయిస్తున్నాం. సేంద్రియ వ్యవసాయంపై రైతుల్లో చైతన్యం రావాలి.

– ముమ్మిడి మంగరాజు, సేంద్రియ వ్యవసాయ రైతు, గొంచాల

భూమికి సేంద్రియ పద్ధతితో జీవం



సేంద్రియ పద్ధతిలో భూమికి జీవం పోయడానికి అవకాశం ఉంది. అధిక దిగుబడి, ఆధునిక వ్యవసాయం పేరుతో విచ్చలవిడిగా భూమిపై చల్లుతున్న పురుగుమందులు, భూసారం లేని రసాయన ఎరువుల వాడకంతో నేల జీవం లేకుండా పోతోంది. మండల పరిధిలో వర్మీ కంపోస్టు యూనిట్లు రైతులు సందర్శించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో అవగాహన పెంచడానికి రైతు సాధికారిక సంస్థలను ఏర్పాటు చేశాం.

– ఐ.సత్య, మండల వ్యవసాయాధికారి, సామర్లకోట

కార్మికుల్లో విప్లవ చైతన్యం రావాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మధు

సామర్లకోట: కార్మిక వర్గంలో విప్లవ చైతన్యం వచ్చిన సమయంలోనే పాలకుల్లో మార్పు వస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు అన్నారు. లెనిన్ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లెనిన్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. మధు మాట్లాడుతూ లెనిన్ జీవిత విశేషాలను వివరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు పీఎస్ నారాయణ, స్థానిక నాయకులు బచ్చు శ్రీను, కసింకోట ఆనందరావు, మాజీ కౌన్సిలర్ ఎలిశెట్టి రామదాసు తదితరులు పాల్గొన్నారు.

పెంకుటిల్లు దగ్ధం

కోటనందూరు: మండలంలోని భీమవరపుకోట మాదిగపేటలో ఆదివారం తెల్లవారుజామున ఓ పెంకుటిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన శీలి దుర్గాభవానీ తన పెంకుటింట్లో వంట చేస్తుండగా మంటలు చెలరేగి ఇంటికి నిప్పంటుకుంది. టీవీ, ఫ్రిజ్, వాషింగ్ మెషీన్, డైనింగ్ టేబులతో పాటు నిత్యావసరాలు కాలి బూడిదయ్యాయి.

సంక్షేమ పథకాలతో పేదరిక నిర్మూలన



చిన్నారిని సత్కరించిన కమిషనర్ రామారావు, ఎంఈఓ శివరామ కృష్ణయ్య తదితరులు

సామర్లకోట: ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవడం ద్వారా పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని బీజేపీ రాష్ట్ర మహిళా నాయకురాలు తుమ్మల పద్మజ అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర వాహనం ఆదివారం సామర్లకోట పట్టణానికి చేరింది. ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆధార్ కేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ జె.రామారావు అధ్యక్షత వహించారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థిని ప్రదర్శిక నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. మున్సిపల్ కమిషనర్ రామారావు ఆధ్వర్యంలో బాలికను సత్కరించారు. మండల వ్యవసాయాధికారి ఐ.సత్య, ఎంఈఓ వై శివరామకృష్ణయ్య, మున్సిపల్ మేనేజరు అచ్యుతరాజు, మున్సిపల్ సిబ్బంది, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, పట్టణ అధ్యక్షుడు పెన్నాడ జగన్నాథం, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కుర్రాళ్లుగా విడిపోయి.. తాతలుగా కలుసుకుని..

- 50 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు
- ఆటపాటలతో సందడి



గొల్లప్రోలులో 50 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పిఠాపురం: నిక్కర్లు, పట్టుపరికిణీలు వేసుకుని ఆడుతూ.. పాడుతూ.. చదువుకున్న వారంతా ఇప్పుడు తాతలు, అవ్వలుగా కలుసుకున్న అపూర్వ సంఘటన గొల్లప్రోలులో ఆదివారం చోటు చేసుకుంది. సుమారు 50 ఏళ్ల తరువాత వారంతా ఒక్కచోట కలుసుకున్నారు. గొల్లప్రోలు పేరాజీ లుంబోజీ జిల్లా పరిషత్ ప్రభుత్వోన్నత పాఠశాలకు చెందిన 1974–75 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తాము చదువుకున్న పాఠశాలలోనే కలుసుకుని అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పట్లో వంద మంది వరకూ కలిసి చదువుకోగా ప్రస్తుతం వారిలో 15 మంది చనిపోయారు. 64 మందిని గుర్తించి సమాచారం అందించగా 54 మంది ఈ ఆత్మీయ సమావేశానికి హాజరైనట్టు నిర్వాహకులు తెలిపారు. వారంతా కుటుంబ సమేతంగా కలుసుకుని, పాత స్నేహితులకు పరిచయం చేసుకున్నారు. తమ చిన్న నాటి చిలిపి పనులను గుర్తు చేసుకుని ఆనందించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించారు.

వైభవంగా శ్రీరాముని శోభాయాత్ర



గొల్లప్రోలు మండలం చేబ్రోలులో నిర్వహిస్తున్న శ్రీరాముని శోభాయాత్ర



శిల్పి సాయి రూపొందించిన పవిత్ర పాదాలు



సీతారాముల వేషధారణలో చిన్నారులు



గొల్లప్రోలులో హిందీ అక్షరాలతో ఆచారి గీసిన రామనామం

పిఠాపురం: అయోధ్య రామ మందిరంలో శ్రీరాముని ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ఆదివారం శోభాయాత్ర నిర్వహించారు. భక్తులు కాషాయ వస్త్రాలు ధరించి శ్రీరాముని జెండాలతో ర్యాలీ నిర్వహించారు. తప్పెడగుళ్ల, భజన బృందాలు, మేళతాళాలు, కోలాట ప్రదర్శనలు, డప్పు వాయిద్యాల నడుమ శోభాయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. స్థానిక సీతారామాలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర గ్రామంలోని వాడవాడలా సాగింది. ప్రతి ఇంటి వద్ద ప్రజలు శోభాయాత్రకు అపూర్వ స్వాగతం పలికి హారతులిచ్చారు. సుమారు 3 వేల మంది పాల్గొన్న శోభాయాత్ర ఆద్యంతం శ్రీరామనామ జపంతో కనుల వైకుంఠంగా సాగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సీతారాముల వేషధారణలు

అయోధ్య రామ మందిరంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ఆదివారం చిన్నారులు వేషధారణలతో ఆకట్టుకున్నారు. సీతారామలక్ష్మణ, ఆంజనేయ స్వామి వేషధారణలలో చిన్నారులు శోభాయాత్రలో ఆకర్షణగా నిలిచారు.

అక్షరాలతో అయోధ్య రామనామం

అయోధ్యలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని గొల్లప్రోలు ప్రభుత్వోన్నత పాఠశాలకు చెందిన డ్రాయింగ్ టీచర్ ఆచారి అయోధ్య రామ అనే హిందీ అక్షరాలతో రాముల వారి రూపాన్ని చిత్రీకరించారు.

ఇంటింటా అక్షతల పంపిణీ

సామర్లకోట: అయోధ్యలోని రామమందిరంలో పూజలు చేసిన అక్షింతలు ఇప్పటికే పట్టణానికి చేరుకున్నాయి. వాటికి పూజలు చేసి పట్టణంలో విశ్వ హిందూ పరిషత్ నాయకుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం, పట్టణ, మండలంలోని రామాలయాల కమిటీల నాయకులకు అక్షింతలు అందజేశారు. వార్డు కౌన్సిలర్లు, ఆలయ కమిటీ నాయకులు వాటిని ఇంటింటా పంపిణీ చేశారు. ఆదివారం 13వ వార్డులో కౌన్సిలర్ నేతల హరిబాబు అక్షింతలను అందజేశారు.

శ్రీరాముల పవిత్ర పాదాల రూపకల్పన

పెద్దాపురం: అయోధ్య రామ మందిరం బాల రాముడి ప్రతిష్ఠ సందర్భంగా శ్రీరాముడి పవిత్ర పాదాలను గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ అవార్డు గ్రహీత, పెద్దాపురం పట్టణ బంగారు శిల్పి తాళాబత్తుల సాయి రూపొందించారు. శ్రీరాముడు, ఐరావతం, గోవు, మత్స్యం, కమలం, స్వస్తిక్, జెండా, ఖడ్గం, అంకుశం, విల్లు, బాణం, పారిజాత చెట్టు, శంకు చక్రం, పూర్ణకుంభం, సూర్యుడు, చంద్రుడు తదితర సుమారు 40 చిత్రాలతో వీటిని తయారు చేశారు. ఈ డ్రాయింగ్ కాపీలను ప్రధాని మోడికి, మరికొన్ని దేవాలయాలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్టు సాయి తెలిపారు.

కాండ్రకోటలో బైక్ ర్యాలీ

పెద్దాపురం: అయోధ్యలో శ్రీరామ మందిరం ప్రతిష్ఠలో భాగంగా మండలంలోని కాండ్రకోట గ్రామంలో ఆదివారం సాయంత్రం రామ భక్తులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆశ్రమ గురువు గవరసాని గోపాలకృష్ణ ప్రారంభించారు. ఉలిమేశ్వరం, శిరివాడ, గుడివాడ, తూర్పుపాకల గ్రామాల్లో ర్యాలీ కొనసాగింది.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

రైల్వే పెన్షనర్ల సంఘం డిమాండ్



సీనియర్ పెన్షనర్లను సత్కరించిన సంఘ ప్రతినిధులు

సామర్లకోట: కొత్త పెన్షన్ విధానం కారణంగా విశ్రాంత రైల్వే ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని, పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని రైల్వే పెన్షనర్ల 12వ సర్వసభ్య సమావేశం డిమాండ్ చేసింది. స్థానిక రైల్వే పెన్షనర్ల సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌సింగ్ రాజ్‌పుత్ అధ్యక్షతన ఆదివారం స్థానిక రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. విశ్రాంత రైల్వే ఉద్యోగులు, కార్మికులకు అండగా ఆలిండియా రైల్వే పెన్షనర్ల సంక్షేమ సంఘం పని చేస్తుందని విజయవాడ డివిజన్ అధ్యక్షుడు పి.రామ్‌గోపాల్ అన్నారు. సంఘ డివిజన్ కార్యదర్శి ఎ.కామేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగుల కంటే పెన్షనర్లకు ఎక్కువ సమస్యలుంటాయని తెలిపారు. కేంద్ర పెన్షన్ విధానాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. సంఘ అధ్యక్షునిగా ఎంవీవీ రమణ, ప్రధాన కార్యదర్శిగా ఎల్ఎస్ రాజ్‌పుత్, కోశాధికారిగా ఎస్‌వీవీ సత్యనారాయణతో పాటు, మరో ఏడుగురు సభ్యులను కొనసాగించేలా సమావేశం తీర్మానించింది. అదే విధంగా సెకండరీ ఫామిలీ పెన్షన్ పెండింగ్ కేసులు పరిష్కరించాలని కోరింది. పెన్షన్‌దారుడు మరణిస్తే భార్యకు పెన్షన్, అర్హత ఉన్న కుటుంబ సభ్యులకు పెన్షన్ అందజేయాల్సి ఉండగా, ఏళ్ల తరబడి కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేసింది. ఫ్యామిలీ మెంబర్స్ అలెవెన్సు రూ.మూడు వేలు ఇవ్వాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను వేగంగా పరిష్కరించాలని డిమాండ్ చేసింది. రైల్వే ఆస్పత్రుల్లో అందని వైద్యం, ప్రైవేటు ఆస్పత్రుల్లో చేయించుకుంటే, ఫీజులో 20 శాతమే ఇవ్వడం దారుణమని పేర్కొంది. కార్యక్రమంలో డివిజన్ కోశాధికారి సీహెచ్ కృపయ్య, ఉపాధ్యక్షుడు టి.త్రినాథ్, కాకినాడ బ్రాంచి సంఘ నాయకులు కేవీ రమణరావు, పి.రామ్‌గోపాల్, ఎ కామేశ్వరరావు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ పెన్షనర్లను ఘనంగా సత్కరించారు.

బోనం సమర్పయామి..!



నల్లగొండమ్మతల్లి ఆలయానికి బోనాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

- కన్నులపండువగా నల్లగొండమ్మ తల్లి బోనాల సంబరం
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



ప్రత్యేక అలంకరణలో నల్లగొండమ్మతల్లి

తుని రూరల్: ఎస్.అన్నవరం శివారు వేంపాడు మెట్ట వద్ద కొలువైన నల్లగొండమ్మతల్లి బోనాల మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. స్థానిక రామాలయం వద్ద వేలాది మంది బోనాలను శిరస్సున ధరించి ఊరేగింపును ప్రారంభించారు. శ్రమదానం రోడ్డుమీదగా కొత్త సూరవరం, తుని పట్టణం, ఎస్.అన్నవరంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం మీదుగా ఊరేగింపు ఆలయానికి చేరుకుంది. పెద్దసంఖ్యలో మహిళలు, యువతులు బోనాలను శిరస్సుపై ధరించి భక్తిశ్రద్ధలతో నల్లగొండమ్మతల్లి నామస్మరణ చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు సాంప్రదాయ కొమ్ము, థింసా నృత్యాలను ప్రదర్శించారు. ఎస్.అన్నవరం, తుని పరిసర ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థం అంగరంగవైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చిన్నారుల సంప్రదాయ భరతనాట్య నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ ప్రెసిడెంట్ వంగలపూడి దొరబాబు, కార్యదర్శి వంగలపూడి ఫణి, కోశాధికారి వంగలపూడి జమీలు, నాయకులు వంగలపూడి మహేష్, వంగలపూడి బుజ్జి, కాంతారావు, గోవిందుబాబుతదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నడకతోనే సంపూర్ణ ఆరోగ్యం



తుని వాకర్స్ క్లబ్ జిల్లా గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న చదరం శివాజీ

తుని: ప్రతిరోజూ కొంతదూరం నడిస్తే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని అంతర్జాతీయ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు మురళీమోహనరావు అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ రోడ్డులోని రోటరీక్లబ్ భవనంలో ఆదివారం వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. క్లబ్ జిల్లా గవర్నర్‌గా చదరం శివాజీ, కార్యదర్శిగా కుందెం సత్యనారాయణ, కోశాధికారిగా కొమ్మోజు గౌరీశంకర్ ఎన్నికయ్యారు. వీరితో మురళీమోహనరావు ప్రమాణీ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మురళీమోహనరావు మాట్లాడుతూ తుని వాకర్స్ క్లబ్ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అంతర్జాతీయ మాజీ గవర్నర్ కోదూరి రంగారావు, ఎం.ప్రభావతి, ఎస్.ఐజాక్, సత్యానందం, అభిమన్యు నాయక్, సాయిరాం, కలిదిండి సత్యనారాయణరాజు, కుచ్చర్లపాటి భీమరాజు, దణ్యంరాజు సత్యసాయి, చోడిశెట్టి త్రిమూర్తి స్వామి, రెడ్డి రత్నం తదితరులు పాల్గొన్నారు.